క్లుప్తంగా

మంత్రి ఎర్రబెల్లిని కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు



రఘునాథపల్లి: పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌ను ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, మాజీ సైనికుడు డాక్టర్ మాచర్ల భిక్షపతితో కలిసి ముదిరాజ్ సంఘం నేతలు ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి బొకే, శాలువాలతో సత్కరించారు. ముదిరాజ్ కులస్తుల సంక్షేమంతో పాటు రాజకీయంగా అవకాశాలు కల్పించాలని మంత్రికి విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించినట్లు ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని కలిసిన మాజీ ఎంపీటీసీలు



స్టేషన్‌ఘన్‌పూర్: గత ఉమ్మడి స్టేషన్‌ఘన్‌పూర్ మండలానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని హన్మకొండలోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బూర్ల శంకర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు కడియంకు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ సంపూర్ణ మద్దతు ఎల్లవేళలా ఉంటుందని, కడియం నియోజవకర్గంలో ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధిలో వెనుకబడిందని, మీతోనే అభివృద్ధి సాధ్యమని వారు కడియంను కోరారు. ఇందుకు కడియం సానుకూలంగా స్పందిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ అధినేత ఆదేశాల మేరకు పనిచేస్తానని, రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. కడియంను కలిసిన వారిలో ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు మండలాలకు చెందిన మాజీ ఎంపీటీసీలు గోనెల ఉపేందర్, డాక్టర్ అంబటి సత్యనారాయణ, పులిగిళ్ల గట్టయ్య, తాళ్లపెల్లి సంపత్, ఇసాక్, ఎడ్ల శ్రీను, రవి తదితరులు ఎన్నారు.

మహారాష్ట్ర మంత్రిని కలిసిన గాండ్ల దేవేందర్



స్టేషన్‌ఘన్‌పూర్: మహారాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ధర్మారావు బాబా మహరాజ్‌ను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాండ్ల దేవేందర్‌పటేల్ ఆదివారం మహారాష్ట్రలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. బీసీల సమస్యలపై ప్రత్యేక చొరవతో పనిచేయాలని ఆయన కోరారు.

ఎన్నిక


కరుణాకర్‌రెడ్డి

బచ్చన్నపేట: రాష్ట్ర మాజీ సైనికుల సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా దండ్యాల కరుణాకర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మాచర్ల భిక్షపతితో పాటు బచ్చన్నపేట మండలంలోని ఆలింపూర్ గ్రామానికి చెందిన దండ్యాల కరుణాకర్‌రెడ్డిని ప్రధాన కార్యదర్శిగా నియమించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించేలా పని చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో రాష్ట్ర భాధ్యతలను అప్పగించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటినుంచి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ క్రికెట్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్: బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీజన్ వన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రావణ్‌కుమార్ పటేల్, సంతోష్, తిరుపతి తెలిపారు. ఈమేరకు కేయూ మైదానంలో క్రికెట్ టోర్నీ బ్రోచర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో ఈనెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కొనసాగనున్న పోటీల్లో పాల్గొనే జట్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేత జట్టుకు రూ.5వేలు, రన్నరప్ జట్టుకు రూ.2,500ల నగదు పురస్కారంతో పాటు ట్రోఫీలు అందజేయనున్నట్లు వివరించారు.

రేషన్.. పరేషాన్

- డీలర్ సస్పెన్షన్‌తో ఇబ్బందులు పడుతున్న అంకుషాపూర్ లబ్ధిదారులు
- నాలుగు నెలలుగా నిలిచిన బియ్యం పంపిణీ


అంకుషాపూర్‌లోని చౌకధరల దుకాణం

తరిగొప్పుల: పేదల ఆకలి తీర్చాలనే సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగంగా చౌక ధరల దుకాణాల ద్వారా ప్రతీ నెల బియ్యం అందజేస్తుంది. మండలంలోని అంకుషాపూర్‌లో జాతీయ ప్రజా పంపిణీ పథకం షాపు నంబర్-1 పరిధిలోని లబ్ధిదారులు గత కొన్ని నెలలుగా రేషన్ బియ్యం పొందేందుకు తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు. రేషన్ డీలర్ జీడికంటి రాజయ్య బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడినట్లు ఫిర్యాదు రావడంతో కొన్ని నెలల క్రితం విచారణ చేపట్టారు. కాగా, దాదాపు రెండు నెలలకు సంబంధించిన రేషన్ కోటా వ్యత్యాసం రావడంతో సంబంధిత శాఖ అధికారులు అతడిని సస్పెండ్ చేశారు. దీంతో రేషన్ లబ్ధిదారులు సమీప గ్రామాలైన బంజరుపల్లి, సోలిపూర్,తరిగొప్పుల, హుస్నాబాద్‌లోని కొండపూర్‌లలోని రేషన్ షాపులకు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నారు. గ్రామంలో 450 తెల్ల రేషన్ కార్డులు, 28 అంత్యోదయ కార్డులు ఉండగా అందుకు గానూ నెలవారి కోటాలో 80 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. కాగా, రెండు నెలల కోటా పంపిణీలో డీలర్ జీడికంటి రాజయ్య అవకతవకలకు పాల్పడగా రికవరిగా రూ.2.50 లక్షలు చెల్లిస్తేనే, తిరిగి మరల గ్రామానికి సరిపడా రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తామని పౌర సరఫరా శాఖ అధికారులు సూచించారు. ఏదేమైనప్పటికీ నాలుగు నెలలుగా తాము రేషన్ బియ్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని గ్రామంలో రేషన్‌డీలర్‌ను నియమించి బియ్యం పంపిణీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెండు నెలల బియ్యం వదిలేసుకున్నాం..



ఇతర గ్రామానికి వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. రెండు నెలలుగా 24 కేజీల రేషన్ బియ్యం తెచ్చుకోవడమే లేదు. మరో రేషన్ డీలర్‌ను నియమించి ప్రజలకు బియ్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పైసా ప్రేమ్‌కుమార్

ఆటో కిరాయి పెట్టుకొనిపోయి బియ్యం తెచ్చుకుంటున్నాం..



తమకు 18 కిలోల రేషన్ బియ్యం వస్తాయి. సమీపంలో బంజరుపల్లి రేషన్ డీలర్ వద్ద బియ్యానికి పోతే అక్కడి ప్రజలకు పంపిణీ చేసిన తర్వాతనే ఇస్తామంటున్నారు. చేసేది లేక హుస్నాబాద్ మండలంలోని కొండాపూర్‌కు ఆటో కిరాయి పెట్టుకొని పోయి మరీ రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నాం.

– జంజాల కనకవ్వ

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి


లింగాలఘణపురం: నిరసన తెలుపుతున్న నాయకులు


బచ్చన్నపేటలో..

లింగాలఘణపురం: బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సామాజిక కార్యకర్తగా పేదల పక్షాన పోరాడే రామకృష్ణయ్యను హత్యకు కుట్ర పన్ని సుపారీ దుండగులతో హత్య చేయించిన నిందితులను కఠినంగా శిక్షించాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు దేవదానం, నాయకులు శంకరయ్య, బిక్షపతి, యాదయ్య, రమేష్, వెంకటయ్య, నర్సింహ, రాంచంద్రం, గిరి తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: పోచన్నపేటకు చెందిన నల్ల రామకృష్ణయ్య హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో పలువురు నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ మాట్లాడుతూ రామకృష్ణయ్య హత్యపై విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని అన్నారు. హత్యకు పాల్పడిన నిందితులకు శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. అన్నెబోయిన రాజు, రామగళ్ల అశోక్, పర్వతం నర్సింహులు, మల్లయ్య, హన్మంతు, శోభ, లక్ష్మితోపాటు తదితరులు పాల్గొన్నారు.

'జనగర్జన'కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు


కొడకండ్ల నుంచి..


పాలకుర్తి టౌన్: తరలివెళ్తున్న నాయకులు


జఫర్‌గఢ్ నుంచి..


దేవరుప్పుల నుంచి..

కొడకండ్ల: ఖమ్మంలో ఆదివారం జరిగిన జనగర్జన సభకు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రైవేట్ బస్సులు, వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సభలో హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఆమెను స్వాగతించేందుకు పార్టీ శ్రేణులు వెళ్లారు.

పాలకుర్తి టౌన్: ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జనగర్జన బహిరంగ సభకు మండలం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. ఆదివారం వాహనాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామిల నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

జఫర్‌గఢ్ నుంచి..

జఫర్‌గఢ్: ఖమ్మం జిల్లాలో తలపెట్టిన కాంగ్రెస్ సభకు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పలు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు అన్నెబోయిన భిక్షపతి, పార్టీ మండల అధ్యక్షుడు నూకల ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నాయకులు ఇల్లందుల బాబు, నంచర్ల యాదగిరి, తిరుపతి, రడపాక డానియల్ తదితరులు ఉన్నారు.

దేవరుప్పుల: ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన కాంగ్రెస్ తెలంగాణ జనగర్జనకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండల కేంద్రంలోని జనగామ–సూర్యాపేట రహదారి చౌరస్తాలో పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డికి మద్దతుగా నినదించి బయలుదేరారు. జాకీర్, షబ్బీర్, అనిల్, సజ్జన్,యాకస్వామి ,రమేష్, దశరథం, ఇస్తారి, ఉప్పలయ్య, సోమనర్సింజీ, భాస్కర్, మహేందర్, సోమిరెడ్డి ఉన్నారు.

రఘునాథ్‌పల్లిని ఐనవోలు మండలంలో చేర్చాలి


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

జఫర్‌గఢ్: మండలంలోని రఘునాథ్‌పల్లి గ్రామాన్ని ఐనవోలు మండలంలో చేర్చాలని కోరుతూ సర్పంచ్ బొమ్మినేని శ్రీదేవి పెద్దిరెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు కలసి ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్‌పల్లి గ్రామాన్ని హనుమకొండ జిల్లాలోని ఐనవోలు మండలంలో చేర్చాలంటూ నినాదాలు చేశారు. అనంతరం సర్పంచ్, ఎంపీటీసీ మాట్లాడుతూ జనగామ జిల్లాలో తమ గ్రామాన్ని చేర్చడం వల్ల తామెంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. తమ గ్రామానికి హనుమకొండ జిల్లా అందుబాటులో ఉంటుందన్నారు. ఇందుకోసం తమ గ్రామాన్ని వెంటనే హనుమకొండ జిల్లాలోని ఐనవోలు మండలంలో చేర్చాలని, ఇదే విషయాన్ని నిరసన ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలిపారు. వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సన్మానం



పాలకుర్తి టౌన్: బీజేపీ పాలకుర్తి మండల అధ్యక్షుడు కమ్మగాని శ్రీకాంత్‌ను రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శాలువాతో ఆదివారం సన్మానించారు. మండల అధ్యక్షుడిగా అన్ని గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి శ్రీకాంత్ కృషి అభినందనీయమని అన్నారు. హనుమకొండలో నిర్వహించనున్న సమావేశంలో ఈ సన్మానం నిర్వహించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు.

'రాజారెడ్డిని విమర్శిస్తే ఊరుకోం..'


మాట్లాడుతున్న సుగుణమ్మ

నర్మెట: మాజీ ఎమ్మెల్యే, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు చారగొండ రాజారెడ్డిని సీపీఎం, సీఐటీయూ నాయకులు విమర్శిస్తే సహించేది లేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, మండల కార్యదర్శి ప్రశాంత్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఆకుల పెంటయ్య స్మారక భవనాన్ని కబ్జా చేయాలని చూస్తున్న సీపీఎం నాయకులు మోకు కనకారెడ్డి, రాపర్తి రాజు, విజయేందర్ తమ తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసం రాజారెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని షాప్స్, గ్రీన్ మార్కెట్ హమాలీ సంఘం 2007 నుంచి ఏఐటీయూసీకి అనుబంధంగా ఉన్నాయని తెలిపారు. ప్రత్యక్ష పోరాటం చేతకాక దొంగల్లా ప్రవర్తిస్తూ కార్మికులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవడం తగదని సూచించారు. దేవరకొండ పద్మ, బైరోజు లక్ష్మి, అంగిరేకుల పద్మ, బైరోజు రాములు తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి


ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మేరు సంఘం నాయకులు

జనగామ రూరల్: సమాజంలో వెనుకబడిన మేరు కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని మేరు సంఘం జిల్లా కన్వీనర్ రాపర్తి ప్రశాంత్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేరు ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులకు దుస్తులు కుట్టడానికి అవకాశం ఇవ్వాలని, వారికి ఉచితంగా కుట్టు మిషన్లు అందించాలని కోరారు. 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ అందించాలని, ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వాలన్నారు. బీసీ రుణాల్లో మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. నాయకులు అజయ్‌కుమార్, అంజనేయులు, శ్రావన్‌కుమార్, ప్రవీన్, ఆదినారాయణ, నరేందర్, అనిల్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

నర్మెట: మండలకేంద్రానికి చెందిన పలువురు అనారోగ్యంతో ఇటీవల ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. కాగా, ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదివారం పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారిలో ఆమెడపు సాయి చరణ్ రెడ్డి(రూ. 14 వేలు), వలబోజు సంధ్యారాణి (14,500) , గోడుగు రవి (24వేలు), నక్కల శివరాణి (60వేలు), అనందాసు వెంకటయ్య (రూ. 32 వేలు) ఉన్నారు. సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, టీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్, వార్డు సభ్యులు ముక్కెర మహేందర్, పొన్నం బాలకృష్ణ, నాయకులు వలబోజు శ్రీనివాస్, పాతూరి బుచ్చిరెడ్డి, వంగ సుధాకర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళాల అందజేత


చందా ఇస్తున్న ఆర్‌ఎంపీ చక్రపాణి

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గామాత ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళాలను అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ శివరాత్రి రాజనర్సు తెలిపారు. ఆదివారం గ్రామంలో కమిటీ సభ్యులతో తిరిగి పలువురి వద్ద చందా డబ్బులను వసూలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి పలువురు దాతల వద్ద చందాలను వసూలు చేశామని తెలిపారు. గ్రామంలోని ప్రతి రేషన్ కార్డు దారుడు రూ.4 వేలను తప్పకుండా చెల్లించాలని గ్రామ అభివృద్ధి కమిటీ తీర్మాణాన్ని చేశారని అన్నారు. ఆర్‌ఎంపీ వైద్యులు రాపెల్లి లీలా, చక్రపాణి దంపతులు రూ. 11 వేలు, నూకల తేజ, రవీందర్‌రెడ్డి రూ. 11 వేలు, ఎర్రోజు సుజాత శ్రీనివాస్ దంపతులు రూ. 5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. జంగిలి ఆంజనేయులు, రాపెల్లి జనార్ధన్, కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి, గౌరారం కనుకయ్య, సెద్దిని నర్సింహులు, గూడెముల్ల ప్రభాకర్, శివరాత్రి రాజనర్సు, పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి


మాట్లాడుతున్న రాజేష్‌కుమార్

కొడకండ్ల: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరిగాయని తమిళనాడు రాష్ట్రం నుంచి వచ్చిన బీజేపీ విస్తారక్, రాష్ట్ర బూత్ సశక్తికరన్ ఇన్‌చార్జ్ టి.రాజేష్‌కుమార్ అన్నారు. ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం సుపరిపాలన అందించడం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని కోరారు. బీజేపీ జిల్లా కార్యదర్శి సోమన్న, నాయకులు కోటేశ్వర్‌రావు, శ్రీనివాస్, పనస రాములు, అంజనేయులు, హరిబాబు, సురేష్, నాగయ్య, రమేష్, మహేష్, గణేష్, ఉమేష్, కుమార్ పాల్గొన్నారు.

జైన రమేష్‌కు వైశ్య లైమ్‌లైట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న జైన రమేష్

జనగామ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన జైన రమేష్ వైశ్య లైమ్‌లైట్ అవార్డును అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్ ఫిల్మ్‌నగర్‌లో వాసవీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, మానేపల్లి జ్యూవెల్లరీ ఇమ్మడి టీవీ ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రాలకు వైశ్య లైమ్ లైట్ అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఓటింగ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన వ్యక్తిగా రమేష్ గుర్తింపు పొందారు. ఎంపికైన ఐదుగురులో రమేష్ ఒకరిగా నిలిచారు. కాగా, నిజామాబాద్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, ఎమ్మెల్సీ బొంగారపు దయానంద్, ఉప్పల శ్రీనివాస్ చేతుల మీదుగా రమేష్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్యులు రమేష్‌కు అభినందనలు తెలిపారు. పజ్జూరి గోపయ్య, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు మహంకాళి హరి చంద్రగుప్త, ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్ కుమార్ ,మార్యాల అశోక్, గాందే వేణు, శర్విరాల ఉపేందర్ , తోడుపునూరు ప్రసాద్, బచ్చు అశోక్, మంచన హరీష్, మహంకాళి నటరాజ్, అల్లాడి రామకృష్ణ, కృష్ణ, కందుకూరి కుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత


బియ్యం అందజేస్తున్న నరేష్ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండల కేంద్రానికి చెందిన గుంటి లక్ష్మి అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, ఘన్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ఇల్లందుల నరేష్‌గౌడ్ మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె మృతిపై ప్రగాఢ సంతాపం తెలిపారు. ఇల్లందుల రాజు, నర్సింహ, గుంటి నరేష్‌తోపాటు తదితరులు ఉన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హన్మకొండ: రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి కోరారు. హనుమకొండ హంటర్‌రోడ్డులో హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్‌ను రెడ్డి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ బాధ్యులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కమిటీ బాధ్యులు మర్రి యాదవరెడ్డి, కేశవ రెడ్డి, నరహరి తిరుపతిరెడ్డి, తిరుపతిరెడ్డి, హరికృష్ణారెడ్డి ఉన్నారు.

పంచాయతీకి ఆదాయ వనరుగా పండ్ల మొక్కలు


నర్సరీలోని పండ్ల మొక్కలు, (ఇన్‌సెట్‌లో) జామ చెట్లు

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల పంచాయతీకి నర్సరీ, పల్లెప్రకృతి వనంలో పెరిగిన పండ్ల మొక్కలతో ఆదాయవనరుగా మారనుంది. సుమారు 11 ఎకరాల్లో అనేక రకాలైన పండ్ల మొక్కలను మూడేళ్ల క్రితం సర్పంచ్ స్వరూపరాణిభూపాల్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో నాటారు. అందులో జామ, అల్లనేరడు, సీతాఫలం, దానిమ్మ, మామిడి, ఉసిరి, మునగ వంటి అనేక రకాల పండ్ల మొక్కలను నాటారు. సుమారుగా 3500ల జామ మొక్కలు ఉండగా అందులో 25 రకాలవి ఉన్నాయి. అదేవిధంగా అల్లనేరడు 4000, దానిమ్మ 1000, సీతాఫలం 1500, ఉసిరి 1000 మొక్కలు ఉన్నాయి. వీటిలో జామ ప్రస్తుతం కాత దశకొచ్చాయి. ఇటీవల సర్పంచ్ జామ తోటకు వేలం వేసేందుకు కలెక్టర్ అనుమతిని కోరారు. త్వరలో వేలం పాట నిర్వహిస్తే ప్రతీ ఏడాది గ్రామ పంచాయతీకి ఆదాయవనరు కానుంది. అదేవిధంగా మిగిలిన పండ్ల మొక్కలు కూడా కాత దశకు వస్తే ఇక మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మూడేళ్ల క్రితం పెట్టిన మొక్కలను ఎంతో శ్రద్ధగా పెంచడంతో నేడు ప్రయోజనం కలుగనుంది.

ఇటీవల కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..



పల్లెప్రకృతి వనం, నర్సరీలో నాటిన పండ్ల మొక్కలు కాత దశకు వచ్చాయి. వాటికి వేలం నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అనుమతి వస్తే వేలం నిర్వహిస్తాం. వచ్చిన ఆదాయంతో పంచాయతీ అభివృద్ధి, ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పనకు ఉపయోగిస్తాం.

– చిట్ల స్వరూపరాణి, సర్పంచ్, నెల్లుట్ల